క్లుప్తంగా

ద్రోణంరాజు ఇంట్లో 'నల్లారి'



ద్రోణంరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

ఏయూ క్యాంపస్: దివంగత మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు ఇంటికి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మంగళవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు శ్రీనివాసరావు కుమారుడు శ్రీవాత్సవ్, ఇతర కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. ద్రోణంరాజు సత్యనారాయణ, శ్రీనివాసరావులతో తనకున్న అనుబంధం, వివిధ సంఘటనలను ఆయన గుర్తు చేసుకున్నారు.

వృద్ధురాలి అప్పగింత



వృద్ధురాలిని గోల్డేజ్ హోం ప్రతినిధికి అప్పగిస్తున్న పోలీస్

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి శ్రీనగర్‌లోని గోల్డేజ్ రిటైర్మెంట్ హోమ్స్ నుంచి ఒక వృద్ధురాలు ఎవరికీ తెలియకుండా బయటికి రావడంతో స్థానికులు ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్‌కు తెలియజేశారు. భీమిలికి చెందిన వృద్ధురాలు ఐదు నెలలుగా ఈ హోంలో ఉంటున్నారు. మంగళవారం వృద్ధురాలు భీమిలి వెళ్లేందుకు రామా టాకీస్ వద్దకు ఆటో కోసం రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు ఫోర్తుటౌన్ పోలీసులకు తెలిపారు. వెంటనే పోలీసులు వచ్చి గోల్డేజ్ హోం నిర్వాహకులకు వృద్ధురాలిని అప్పగించారు. నిర్వాహకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



నరసింహనగర్ రైతుబజార్‌లో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

సీతంపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 ప్రచారంలో భాగంగా భద్రం ఫౌండేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కళాకారులు మంగళవారం నరసింహనగర్ రైతుబజార్‌లో 'ప్లాస్టిక్‌తో ప్రమాదం' అనే వీధి నాటిక ప్రదర్శించారు. పాలిథిన్ బ్యాగుల వినియోగం, ప్లాస్టిక్ వల్ల కలిగే ముప్పును వివరించారు. కార్యక్రమంలో బజారు ఎస్టేట్ ఆఫీసర్ పి.చినబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నానాజి పాల్గొన్నారు.

కార్మిక వర్గాన్ని దెబ్బకొట్టే యత్నమే ప్రైవేటీకరణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన దీక్షల్లో 922వ రోజు మంగళవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

పచ్చదనం.. ప్రశ్నార్థకం

- ఏయూలో యథేచ్ఛగా పశు సంచారం
- పట్టించుకోని జీవీఎంసీ
- హరించుకుపోతున్న పచ్చదనం



సౌత్ క్యాంపస్‌లో సంచరిస్తున్న పశువులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పశు సంచారం ఎక్కువైంది. నిత్యం పదుల సంఖ్యలో పశువులు వర్సిటీలో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. వాటిని కట్టడి చేయడంలో జీవీఎంసీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా ఏయూలో పచ్చదనం ప్రశ్నార్థకంగా మారింది. పచ్చదనం పరిరక్షణ వర్సిటీ అధికారులకు పెద్ద సమస్యగా మారిపోయింది. నాటిన మొక్కలను పశువులు తరచూ తినేస్తున్నాయి. ప్రతి మొక్కకు టీ గార్డ్‌ను ఉంచాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది వర్సిటీకి ఆర్థిక భారమవుతోంది. పరిసర ప్రాంతాలలో ఉంటున్న పలువురు తమ పశువులను వర్సిటీలో వదిలేసి వెళ్లిపోతున్నారు. నిత్యం ఇవి రోడ్లపై, మైదానాలు, విభాగాల వద్ద గుంపులుగా దర్శనమిస్తున్నాయి. విద్యార్థులను పొడవడానికి సైతం వస్తుండడంతో వారంతా బెంబేలెత్తిపోతున్నారు. నగరంలో రోడ్లపై పశు సంచారాన్ని జీవీఎంసీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. వీటిని రోడ్లపైకి వదలకుండా పశు యజమానులకు సూచించాల్సిన అవసరం ఉంది. గతంలో ఏయూ సెక్యూరిటీ అధికారులు వర్సిటీలో పశువుల సంచారాన్ని నిరోధించే ప్రయత్నం చేస్తే పెంపకందారులు అనవసర రాద్ధాంతం చేశారు. పశు సంచారం నిరోధానికి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలుమార్లు జీవీఎంసీకి ఏయూ అధికారులు విన్నవించుకున్నారు. జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు.



ఇంజినీరింగ్ హాస్టల్ బ్లాక్ వెనక భాగంలో మొక్కలను తినేస్తున్న పశువులు

జీవీఎంసీ చర్యలు తీసుకోవాలి...



వర్సిటీలో పశువుల సంచారం నియంత్రణకు జీవీఎంసీ తక్షణం చర్యలు తీసుకోవాలి. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పదుల సంఖ్యలో పశువులు వర్సిటీలో సంచరిస్తూ పచ్చదనాన్ని సైతం హరిస్తున్నాయి.

-కెప్టెన్ జి.వివేకానంద, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, నార్త్ క్యాంపస్

ఘనంగా కనకమ్మ అమ్మవారి జాతర



అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు

మద్దిలపాలెం: పాత వెంకోజీపాలెంలో కొలువుదీరిన కనకమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి గ్రామంలో మహిళలు స్వయంగా బిందెలతో నీటిని తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం గ్రామ సేవా సంఘాల ప్రతినిధులు తొలి పూజ చేశారు. తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు, కార్పొరేటర్లు అప్పారి శ్రీవిద్య, మొల్లి లక్ష్మి, మువ్వల లక్ష్మి, పార్టీ నాయకులు గిరిబాబు, అప్పారావు , సురేష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లా దుర్గారావు, పీలా వెంకట పరదేశినాయుడు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సమాజంలో శాంతి స్థాపనకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్, తదితరులు

ఎంవీపీ కాలనీ: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎంవీపీ కాలనీలో నిర్వహించిన శాంతి ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఎంవీపీ కాలనీ సర్కిల్ నుంచి రైతుబజార్ వరకు జరిగిన ఈ ర్యాలీలో సంస్థ చైర్మన్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అశాంతి, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సమాజంలో శాంతి స్థాపన దిశగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు మానవతా సంస్థ కృషి చేస్తోందన్నారు. విద్యార్థి దశలోనే యువతలో చైతన్యం తీసుకురావడం ద్వారా సమాజంలో విలువలను పెంచేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన 'భారత ప్రశస్తి' పద్య రూపకం



పద్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: శ్రీలలితాపీఠం ఆధ్వర్యంలో విశాఖ సాహితి సహకారంతో పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహా స్వామి సమక్షంలో నన్నయ మహాభారత రచన సహస్రాబ్ది ఉత్సవాల్లో భాగంగా భారత ప్రశస్తి అనే పద్య రూపకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాజరాజ నరేంద్రుడిగా డాక్టర్ పేరి రవికుమార్(విశాఖ), నన్నయగా డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ (నరసాపురం), తిక్కనగా శ్రీకోట వెంకటలక్ష్మీ నరసింహం (తణుకు), ఎర్రనగా తాత సత్యసందీప్ శర్మ(విశాఖ), నారాయణభట్టుగా ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ (హైదరాబాద్) నన్నయ భారత రచన ప్రస్థానాన్ని అలాగే రాజరాజ నరేంద్రుడి ప్రోత్సాహాన్ని పద్యరూపకంలో కడు రమ్యంగా ప్రదర్శించారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా విశాఖసాహితి అధ్యక్షులు ఆచార్య కోలవెన్ను మలయవాసిని వ్యవహరించారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని, విశాఖ సాహితి కార్యదర్శి శంకర్ నీలు భాగవతుల, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్షతగాత్రులకు పరామర్శ

ఎంవీపీ కాలనీ: పాడేరు ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయాలపాలై మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంగళవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్ర రామలక్ష్మి పరామర్శించారు. ఈ ప్రమాదంలో పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడగా.. ఐదుగురిని మెడికవర్‌కు తరలించి చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఆమె.. అనంతరం వైద్యులతో మాట్లాడారు. వారికి అవసరమైన మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ధైర్యం చెప్పారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఎకో ఫ్రెండ్లీ రాఖీల తయారీలో శిక్షణ



రాఖీలు తయారు చేస్తున్న దివ్యాంగ చిన్నారులు

సీతంపేట: జేసీఐ జూనియర్ పరాక్రమ్ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీలో దివ్యాంగ పిల్లలకు రాఖీల తయారీలో శిక్షణ ఇచ్చారు. ప్లాస్టిక్ ఉపయోగించకుండా ఎకో ఫ్రెండ్లీ రాఖీలు ఎలా తయారు చేయాలో నేర్పించారు. ఊలు, ముత్యాలు ఉపయోగించి రాఖీలు తయారు చేసి జేసీఐ సభ్యులకు కట్టారు. ఈనెల 29, 30, 31 తేదీల్లో దివ్యాంగ పిల్లలు తయారు చేసిన ఎకో ఫ్రెండ్లీ రాఖీలు ప్రదర్శన, విక్రయం జరుగుతుందని సొసైటీ అధ్యక్షురాలు సుచిత్రారావు తెలిపారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు మాధవీలత, వంశీ, రాము, మురళీకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్‌లో కాంతుల కనువిందు



హనుమంతవాక వద్ద విద్యుత్ కాంతుల మధ్య ఆంజనేయ విగ్రహం



పెదగదిలి వద్ద వాటర్ ఫౌంటైన్ రంగులు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో విద్యుత్ కాంతులు కనువిందు చేస్తున్నాయి. జీవీఎంసీ అధికారులు హనుమంతవాక, పెదగదిలి కూడళ్ల వద్ద వివిధ వర్ణాలతో తీర్చిదిద్దారు. హనుమంతవాక కూడలి వద్ద బీఆర్‌టీఎస్ కారిడార్‌లో జీవీఎంసీ రూ.60 లక్షల నిధులతో 40 అడుగుల ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. హనుమంతుడు సంజీవిని పర్వతాన్ని ఒంటి చేతితో పట్టుకొని వస్తున్నట్లు ఈ విగ్రహాన్ని తయారు చేశారు. ఓ చేతితో గధ, మరో చేతితో సంజీవిని పర్వతం పట్టుకొని ఒక రాతి కొండపై నిలబడినట్లు ప్రతిష్ఠించారు. దీని చుట్టూ వివిధ రంగులతో కూడిన విద్యుత్ బల్బులు అమర్చారు. ఈ విగ్రహాన్ని ఈ నెల 21న మేయర్ గొలగాని హరి వెంటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ అక్కరమాని విజయనిర్మల ప్రారంభించారు. అప్పటి నుంచి రాత్రివేళ ఇక్కడ రంగురంగుల విద్యుత్ బల్బులు వెలుగుతూ వాహనచోదకులను, ప్రయాణికులకు కనువిందు చేస్తున్నాయి. దీంతో పాటు మూడు నెలల క్రితం పెదగదిలి కూడలిలో ఉన్న పెద్ద బావి చుట్టూ జీవీఎంసీ అధికారులు వాటర్ ఫౌంటైన్ ఏర్పాటు చేశారు. ఇక్కడ నీలం, ఆకుపచ్చ, పసుపు, గులాబి రంగుల్లో విద్యుత్ బల్బులు అమర్చారు. రాత్రి వేళ ఈ రోడ్డులో ప్రయాణం ఆహ్లాదకరంగా ఉందని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

27న గాజువాకలో చేనేత కులస్తుల బహిరంగ సభ

సీతంపేట: ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ విశాఖశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన గాజువాక బీసీ రోడ్‌లోని టి.ఎస్.ఆర్.కల్యాణ మండపంలో చేనేత కులస్తుల బహిరంగ సభ జరగనుందని ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్ ప్రసాద్ అన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లు మంగళవారం శంకరమఠం రోడ్‌లోని పద్మశాలి భవనంలో ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 40 లక్షల చేనేతలు ఉన్నా రాజకీయంగా తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. చేనేతల ఉనికిని చాటుకోవడంతో పాటు, సమస్యల పరిష్కారం కోసం 27వ తేదీన గాజువాకలో జరగనున్న చేనేతల బహిరంగ సభకు నేతన్నలంతా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సమతం రమణ మహేష్, రాష్ట్ర అధ్యక్షుడు ఎనమల శివరాంప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, ఏపీ పద్మశాలి సంఘం పెద్దల కమిటీ చైర్మన్ తెడ్లాపు వెంకటేశ్వర్లు, ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయండి



టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

పరవాడ: గొర్లివానిపాలెం సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల కాలనీలో అసంపూర్తి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గొర్లివానిపాలెం జీఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద గల టిడ్కో ఇళ్ల కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ మంజూరు చేసిన 512 టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయినట్లు వెల్లడించారు. వీటిలో 500 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేశామన్నారు. కాలనీలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ సదుపాయాలను కల్పించామన్నారు. సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వచ్చే 10 కల్లా పూర్తి చేసి ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని టిడ్కో హౌసింగ్ కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్‌ను ఆదేశించారు. జెడ్సీ సింహాచలం, ఏపీడీ రాము, సీఎల్‌టీసీ దేముడుబాబు, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కృషితో ఏదైనా సాధ్యమే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొమ్మాది: పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏమీ లేదని, బాల్యం నుంచే క్రమశిక్షణతో నడుచుకుంటే జీవితంలో ఏమైనా సాధించగలరని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జి.తిరుమల ప్రసాద్ అన్నారు. పాఠశాల 36వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్పానికి వైకల్యం అడ్డురాదని, ఒక ఆశయంతో ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఇక్కడి రిటైర్డ్ టీచర్లు డి.ఉష, ఎస్.అంకయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొని తరించారు. ఆలయ ఈవో శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

మానసిక ఆరోగ్యం మహాభాగ్యం



వినయ్ సింగ్‌ని సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: మానసిక ఆరోగ్యం కలిగి ఉండడం మహాభాగ్యమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో మంగళవారం నిర్వహించిన 'అడ్వాన్సెస్ ఇన్ కాగ్నెటివ్ సైన్సెస్– బెటర్ ఫ్యూచర్ ఫర్ ఏజింగ్ అండ్ న్యూరో డైవర్స్ పీపుల్'అంశంపై జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ సంబంధాలలో మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. సంతోషంగా జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. విదేశాల్లో వయోవృద్ధులు సైతం ఎవరిపైనా ఆధారపడకుండా స్వశక్తితో జీవించడం, పనిచేయడం స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. సమ వయస్కుల నుంచి వస్తున్న ఒత్తిడి యువతలో ఆత్మహత్యలను ప్రేరేపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి పాఠశాలలో సైకాలజీ కౌన్సెలర్ అవసరం ఉందన్నారు. బాల్యం, పెరిగిన విధానం, విలువల వ్యవస్థ, సామర్థ్యాలు, జ్ఞాపకశక్తి, సాఫ్ట్ స్కిల్స్ వంటివి వ్యక్తి ప్రగతిని ఎంతగానో ప్రభావితం చేస్తాయన్నారు. కెనడాలోని ఆరెంజ్ న్యూరోసైన్సెస్ సంస్థ సీఈవో డాక్టర్ వినయ్ సింగ్ మాట్లాడుతూ మానవ మస్తిష్కంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఏయూతో సంయుక్తంగా పరిశోధనలు జరపడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి. రామిరెడ్డి మాట్లాడుతూ రోజూ ఆస్పత్రికి పదుల సంఖ్యలో చిన్నారులు వివిధ మానసిక సమస్యలతో వస్తున్నారని, వీరికి అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలకు మూలాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 14 శాతం మంది వృద్ధులు ఉన్నారని, 2030 నాటికి వారి జనాభా 30 శాతానికి పెరుగుతుందన్నారు. ప్రస్తుతం భారతీయుల జీవన కాలం 67సంవత్సరాలు మాత్రమేనని, ఇది మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సైకాలజీ నిపుణుల అవసరం భవిష్యత్తులో మరింత పెరుగుతుందన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధాకృష్ణ, విభాగ విద్యార్థులు, పరిశోధకులు, సైకాలజీ నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.

రే తాత్కాలిక షెడ్ల తొలగింపు



నేలమట్టం చేసిన రే తాత్కాలిక షెడ్లు

ఆరిలోవ: రాజీవ్ ఆవాస్ యోజన(రే) పథకంలో భాగంగా ఆరిలోవలో కొన్నేళ్ల కిందట నిర్మించిన తాత్కాలిక షెడ్లను జీవీఎంసీ అధికారులు తొలగించారు. ఇందులో భాగంగా సోమ, మంగళవారాలు వాటిని సిబ్బంది కూల్చివేశారు. మురికివాడలను అభివృద్ధి చేసి పక్కా గృహాలు నిర్మించాలనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం సుమారు ఎనిమిదేళ్ల క్రితం రే పథకం అమలు చేసింది. ఇందులో భాగంగా ఆరిలోవ ప్రాంతంలో మురికివాడగా గుర్తించిన సూర్యతేజానగర్‌ను జీవీఎంసీ అధికారులు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇక్కడ 204 నివాసాలను గుర్తించారు. అప్పటి వరకు ఉన్న పాకలు, రేకుల షెడ్లను తొలగించి పక్కా గృహాలు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీంతో ఆ కాలనీలో ఆయా షెడ్లను తొలగించారు. ఈ పథకంలో భాగంగా పక్కా నివాసాలు నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక షెడ్లు నిర్మించారు. వాటిని సూర్యతేజానగర్‌కు సమీపంలో ఉన్న శ్రీకాంత్‌నగర్ వెళ్లే డబుల్ రోడ్డు పక్కన సుమారు 50 నివాసాలు, మిగిలిన వాటిని ఆరిలోవ నలభై గజాల కాలనీ ఎదురుగా నిర్మించారు. సూర్యతేజానగర్‌లో పక్కా గృహాలు నిర్మాణం పూర్తవడంతో లబ్ధిదారులు వారికి కేటాయించిన నివాసాల్లోకి వెళ్లిపోయారు. కానీ రోడ్డు పక్కన వేసిన తాత్కాలిక షెడ్లను మాత్రం సుమారు రెండేళ్లుగా తొలగించకుండా వదిలేశారు. ఖాళీగా ఉన్న ఆ నివాసాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయాయి. రెండు రోజుల క్రితం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ వీటిని గమనించి వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరు ఇక్కడ తాత్కాలిక షెడ్లను కూలివేశారు. శివాజీనగర్‌లో షెడ్లను కూడా తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఆయా చోట్ల రోడ్డు విశాలమై ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాప్రయోజిత సేవలు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి వల్లభనాయుడు

ఎంవీపీ కాలనీ: శాశ్వత లోక్ అదాలత్ విశాఖపట్నం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్, న్యాయ సేవా అధికార సంస్థలు అందిస్తున్న ప్రజా ప్రయోజిత సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా విశ్రాంత న్యాయమూర్తి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.వల్లభనాయుడు కోరారు. ఎంవీపీ కాలనీలోని భద్రం పార్కులో ప్రజా ప్రయోజిత, న్యాయ సేవలపై మంగళవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల సమస్యలకు న్యాయ సేవా అధికార సంస్థ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. వ్యక్తులు, వస్తువులతో పాటు విమానయానం, రోడ్డు, నీటి మార్గం ద్వారా రవాణా విషయంలో సమస్యలు, తంతి తపాల, టెలిఫోన్ సేవలు, పారిశుధ్యం, ప్రజా సంరక్షణ, ఆస్పత్రుల సమస్యలు ఇలా అన్నింటికి ఈ సేవలు వినియోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వార్వ అధ్యక్షుడు జేపీ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా నృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శ్రీకాంతాచార్యులు తలపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం అర్చకుడు పవన్‌కుమార్, వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.